సాక్షి
వికారాబాద్
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



కొలువులపై ఆశ..
ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో నిరుద్యోగులు సిద్ధమవుతున్నారు. 6లో▸



పూడికతీత పనులు ముమ్మరం
కోట్‌పల్లి ప్రాజెక్టు కింద కాల్వల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను ఉపాధిహామీ పథకం కింద తొలగిస్తున్నారు. 6లో▸



సీఎంఆర్‌ఎఫ్.. పేదలకు వరం
సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలా మారిందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. 7లో▸

న్యూస్‌రీల్

ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి



నీల్యానాయక్‌కు ఫోన్ అందజేస్తున్న సీఐ రాజేందర్‌రెడ్డి

తాండూరు టౌన్: ఓ వ్యక్తి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా తిరిగి స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. రాథోడ్ నీల్యానాయక్ అనే వ్యక్తి ఈనెల 3న స్థానిక గంజ్ ప్రాంతంలో తన వన్‌ప్లస్ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా శుక్రవారం మొబైల్‌ను గుర్తించి, అతనికి అందజేశామన్నారు. మొబైల్ ఫోన్లు చోరీకి గురైనా లేదా పోగొట్టుకున్నా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ తెలిపారు. నూతన టెక్నాలజీ ద్వారా ఫోన్ ఎక్కడ ఉందో కనిపెడతామని, ప్రజలు, బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష హాల్‌లో విద్యార్థులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 192 మందికి గాను 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎల్‌ఓ మంజుల తెలిపారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసన్నతోపాటు ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి




పీఆర్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోని పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గం పరిధిలోని గ్రామ పంచాయతీ భవనాల పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. మన ఊరు మన బడికి సంబంధించిన పెండింగ్ పనులపై దృష్టిసారించాలని తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. నియోజకవర్గంలో పాడైన రోడ్ల వివరాలు సేకరించి, నివేదిక ఇవ్వాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ, ఎస్‌ఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌డీఎం కో ఆర్డినేటర్‌గా రఘుపతిరెడ్డి

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎల్‌డీఎం కో ఆర్డినేటర్‌గా చామల రఘుపతిరెడ్డి ఎంపికయ్యారు. ఇటీవల రాయపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో నవసంకల్ప్ డిక్లరేషన్ పేరుతో లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్(ఎల్‌డీఎం)ను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా తెలంగాణలోని ఎస్సీ రిజర్వుడ్ అసెంబ్లీ స్థానాల్లో పనిచేసేందుకు.. ఏఐసీసీ ఎస్సీ విభాగం నుంచి వివిధ అసెంబ్లీ స్థానాలకు కో ఆర్డినేటర్లను నియమించారు. వికారాబాద్ బాధ్యతలను రఘుపతిరెడ్డికి అప్పగించారు.

14 వాహనాలు సీజ్



వికారాబాద్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. 1,349 వాహనాలను తనిఖీ చేసి.. 14 వెహికిల్స్‌ను సీజ్ చేశామని పేర్కొన్నారు.

బాస్ వాయిస్‌లో.. బేస్ మనదే!



వికారాబాద్: జిల్లా ఎమ్మెల్యేల వెన్నులో వణుకు మొదలైంది. ప్లీనరీలో సీఎం కేసీఆర్ ఆగ్రహమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అధినేత మండిపాటు వెనక వీరి వ్యవహారాలు సైతం ఉండటం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. దళిత బంధు లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యేలు, వారి అనుచరులు డబ్బులు వసూలు చేస్తున్నారని కేసీఆర్ ప్రస్తావించిన విషయం తెలిసిందే. దీంతో వసూళ్లకు పాల్పడిన ఎమ్మెల్యేలు, వీరి అనుచరులు భయంలో పడ్డారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యేల వైరి వర్గీయులు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా గులాబీ బాస్ వాస్తవాలను గుర్తించారని ప్రచారం చేస్తున్నారు. దళితబంధు లబ్ధిదారుల నుంచి రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఎక్కువ వసూళ్లకు పాల్పడ్డారనే ప్రచారం సాగుతోంది.

ఇంటెలిజెన్స్ రిపోర్ట్

నగరంలో గత గురువారం నిర్వహించిన ప్లీనరీకి ముందే సీఎం కేసీఆర్.. ఇంటెలిజెన్స్ ద్వారా అన్ని జిల్లాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెప్పించుకున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా మన జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది. దళితబంధు అందజేతలో నేతల చేతివాటాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలతో పాటు సొంత పార్టీలోని అసమ్మతి నేతలు సైతం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మండిపడిన విషయాలు తెలిసిందే. జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత సైతం ఈ మాటలన్నీ సీఎం చెవిలో వేశారనే ప్రచారం సాగుతోంది.

గులాబీ నేతల్లో గుబులు
- అధినేత కేసీఆర్ ఆగ్రహంతో ఉలిక్కి పడిన నాయకులు
- జిల్లాలో సైతం 'దళితబంధు' వసూళ్ల పర్వం
- అసమ్మతి, వర్గపోరులోనూ మనదే అగ్రస్థానం

డబ్బులిచ్చిన వారికే 'బంధు'

సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధు పథకంలో కొంతమంది ఎమ్మెల్యేలు కక్కుర్తి వ్యవహారాలు చేస్తున్నారనేది బహిరంగ రహస్యమే. వీరు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిసిందే. ఈ విషయమై జిల్లాలో గతంలోనే అనేక ఆరోపణలు వచ్చాయి. పథకం అందాలంటే ముందుగా రూ.3 లక్షలు చెల్లించాలని అనధికారిక నిబంధన పెట్టడంతో చేసేది లేక అప్పులు చేసి ఇచ్చారు. ఈ నేపథ్యంలో డబ్బులు ఇచ్చిన వారికే దళితబంధు అందగా.. అసలైన అర్హుల పేర్లు మరుగున పడ్డాయి. ఇలా వసూలు చేసిన డబ్బులను అధికార పార్టీ నేతల వద్ద పెట్టిన ఎమ్మెల్యేలు.. వీటిని ఎన్నికల్లో ఖర్చు చేద్దాంలే అని చెప్పినట్లు తెలుస్తోంది.

అన్నిచోట్లా అసమ్మతి

ఇదిలా ఉండగా పార్టీ ప్రతిష్ట దిగజారకుండా ప్రతిఒక్కరూ హుందాగా వ్యవహరించాలని అధినేత దిశానిర్దేశం చేశారు. అందరినీ కలుపుకొని పోయేందుకు అవసరమైతే ఓ మెట్టు దిగాలని సూచించారు. టికెట్లు ఎవరికి ఇవ్వాలో తనకు తెలుసని.. నియోజకవర్గాల్లో టికెట్ల పంచాయితీ వినిపించొద్దని గట్టిగా హెచ్చరించారు. కేసీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలన్నింటిలోనూ మన జిల్లా నేతలు ముందు వరుసలో ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ అసమ్మతి పెరిగిపోతోంది. టికెట్టు నాకంటే.. నాకే అని నేతలు బహిరంగంగా చెబుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా వీరి తీరు మారుతుందా..? లేదా అనేది వేచి చూడాల్సిందే.

కులవృత్తులకు పునరుజ్జీవం

కుమ్మర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి

కందుకూరు: కులవృత్తులకు పునరుజ్జీవం పోయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సామ నరసింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శనివారం నియోజకవర్గం కుమ్మర సంఘం అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ఆధ్వర్యంలో కుమ్మర సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలే బీఆర్‌ఎస్ పార్టీ ఎజెండాగా పని చేస్తుందన్నారు. సంచార జాతుల కోసం ఎంబీసీ కార్పొరేషన్ సైతం ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కుమ్మరులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. కుల వృత్తులను కాపాడుకోవడం మన ధర్మం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్ సాధ మల్లారెడ్డి, కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్‌రావు, రాష్ట్ర నాయకులు దయానంద్, రాజలింగం, లక్ష్మీనారాయణ, వెంకటేశం, వీరేశం, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ సందడి



వికారాబాద్ మెథడిస్ట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో ఆటల్లో మునిగిన చిన్నారులు..

వికారాబాద్: విద్యార్థులకు వేసవి సెలవులు రావడంతో సమ్మర్ క్యాంపుల సందడి మొదలైంది. గతంలో చెరువులు, బావుల్లో సేదతీరే గ్రామీణ విద్యార్థులు ప్రస్తుతం వేసవి శిబిరాలవైపు మొగ్గు చూపుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నిర్వాహకులు సైతం అనేక అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల క్రీడలపై ట్రైనింగ్ ఇస్తుండగా.. మరికొన్ని చోట్ల కళలపై శిక్షణ ఇస్తున్నారు. కొంతమంది డబ్బులు తీసుకుని శిబిరాలు నిర్వహిస్తుండగా.. మరికొందరు సేవా దృక్పథంతో ఉచిత క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.

డిస్ట్రిక్ట్ క్రికెట్ అకాడమీ నేతృత్వంలో..

గతంలో జరిగిన అనేక టోర్నమెంట్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వికారాబాద్‌కు చెందిన క్రికెటర్ విజేందర్ కొన్నేళ్ల పాటు విదేశాల్లో ఉండి వచ్చారు. క్రికెట్‌పై తనకున్న నైపుణ్యాన్ని చిన్నారులకు పంచాలనే సదుద్దేశంతో వివారాబాద్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అకాడమీని స్థాపించారు. దీనికి అనుబంధంగా వికారాబాద్, తాండూరు పట్టణాల్లో మరో ఐదు క్రికెట్ అకాడమీలు నెలకొల్పారు. మెథడిస్ట్ క్రికెట్ అకాడమీ, పాండు మెమోరియల్ క్రికెట్ అకాడమీ, సహారా క్రికెట్ అకాడమీ, క్రికెట్ జోన్ మరియు బాలికల కోసం జననీ క్రికెట్ అకాడమీలను నిర్వహిస్తున్నారు. వీటన్నింటినీ సమన్వయం చేస్తూనే వికారాబాద్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులకు కోచింగ్ ఇస్తున్నారు. అధునాతనమైన షెడ్లు, నెట్లు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం నామమాత్రపు ఫీజులు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో..

ఈసారి క్రీడలు, యువజన విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ సమ్మర్ క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రాలు, నియోజకవర్గ సెంటర్లలో ఆసక్తి ఉన్న క్రీడాకారులు, చిన్నారులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడలు నిర్వహించే ప్రదేశంలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటి సదుపాయాలు కల్పిస్తారు. 50 నుంచి 100 మంది చిన్నారులు సిద్ధంగా ఉండే వెంటనే క్యాంపును ప్రారంభిస్తారు. ఇందులో బాలబాలికలకు క్రికెట్, తైక్వాండో, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ వంటి 14 క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో విరివిగా వేసవి శిబిరాలు
- వివిధ క్రీడలపై విద్యార్థులు, యువతకు శిక్షణ
- క్రికెట్, కరాటే, డ్యాన్స్ వైపు చిన్నారుల మొగ్గు
- స్విమ్మింగ్, కంప్యూటర్స్ నేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి

సంప్రదించాల్సిన వివరాలు

క్రికెట్: విజేందర్, వికారాబాద్, 8929256521
జగన్నాథ్‌రెడ్డి, తాండూరు, 8639730046
స్విమ్మింగ్: శ్రీనివాస్‌రెడ్డి, పరిగి, 9550988989
కరాటే: రాజు, పరిగి 8501994748
కంప్యూటర్స్: భీంరాజ్, కొడంగల్, 9492170415,
పద్మనాభరెడ్డి కొడంగల్, 9493393527
డ్యాన్స్: రమేశ్, తాండూరు, 9848887929, వెంకటేశ్ 8121457765, శివ 9949574369, ఫిట్‌నెస్ డ్యాన్స్ అకాడమీ తాండూరు 9000533981

క్రీడలపై అభిమానంతో..



క్రీడలపై అభిమానంతో క్రికెట్ అకాడమీని ప్రారంభించాం. ఆసక్తి ఉన్న చిన్నారులకు ట్రైనింగ్ ఇస్తున్నాం. మా సేవాదృక్పథాన్ని గుర్తించిన మెథడిస్ట్ చర్చి వారు సైతం అడగగానే గ్రౌండ్‌ను ఇచ్చేందుకు అంగీకరించారు. ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన టోర్నీలో మన జిల్లా క్రీడాకారులు శ్రీలంక జట్టుపై గెలిచారు.

– విజేందర్, క్రికెట్ అకాడమీ ఫౌండర్

మొదటి వారంలో ప్రారంభిస్తాం



క్రీడలు, యువజన విభాగం ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అండర్–14 బాలబాలికలకు పలు అంశాలపై శిక్షణ ఇస్తాం. ఆయా ఆటల్లో ప్రావీణ్యం, ఆసక్తి ఉన్న వారు ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలి. మే మొదటి వారంలో శిబిరాలను ప్రారంభిస్తాం.

– హన్మంతరావ్, క్రీడలు, యువజన విభాగం, జిల్లా అధికారి

రేపటినుంచి ధాన్యం కొనుగోళ్లు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

- జిల్లా వ్యాప్తంగా 126 సెంటర్లు
- అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ
- అన్ని సెంటర్ల వద్ద వసతులు కల్పించాలని ఆదేశం

వికారాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. పౌర సరఫరాలు, వ్యవసాయ, డీసీఎంఎస్, పీఏసీఎస్, ఎఎంసీ, ఐకేపీ అధికారులు, రైస్ మిల్లర్లు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లతో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యాన్ని శుభ్రపర్చి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని 126 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించనున్నట్లు తెలిపారు. 40లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయని, అవసరం మేరకు మరిన్ని అందజేస్తామని స్పష్టంచేశారు. వేసవి నేపథ్యంలో సెంటర్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తాగునీటి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ నిర్ధారణ మిషన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు జిల్లాలో నాలుగు రైస్ మిల్లులే ఉన్నందున, ఏఎంసీ గోదాములను పరిశీలించి, నివేదికలు అందజేయాలని తెలిపారు. అవసరాన్నిబట్టి ముందస్తుగానే గోదాంలను గుర్తించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మురళీధర్‌రావు, సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ విమల, డీఏఓ గోపాల్ పాల్గొన్నారు.

కార్మికుల ఐక్యతను దెబ్బతీయొద్దు

తాండూరు టౌన్: కార్మికుల మధ్య చిచ్చు పెట్టి వారి ఐక్యతను దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న మేడే వేడులకు కార్మికులంతా కలిసి రావాలని కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్మికులకు మాయమాటలు చెప్పి, వారి మధ్య సఖ్యతను దెబ్బతీసేందుకు తాండూరుకు చెందిన బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘం నాయకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీని అడ్డుపెట్టుకుని కార్మికులను తప్పుదోవ పట్టిస్తే తగిన గుణపాఠం చెప్తామని ఆయన హెచ్చరించారు. మే 1నుంచి 7వ తేదీ వరకు కార్మిక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



మేడే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అంబేడ్కర్ అందరివాడు



మాటూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, సాయిచంద్

- ప్రతిఒక్కరూ మహనీయుల బాటలో నడవాలి
- ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, సాయిచంద్

దౌల్తాబాద్: అంబేడ్కర్ అందరి వాడని.. ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అన్నారు. మండలంలోని మాటూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఉన్నత విద్యనభ్యసించి దేశానికి మార్గదర్శకం చేశారని, ఆయన చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికి పరిమితం కాదని, అన్యాయాలపై ప్రశ్నించి, అసమానతలు తగ్గించేందుకు ఎంతో కృషిచేశారని కొనియాడారు. విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రను, సందేశాలను అర్థం చేసుకొని ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. వివక్ష లేని సమాజ స్థాపన కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, జెడ్పీటీసీ మహిపాల్, సర్పంచు వెంకటమ్మ, ఎంపీటీసీ సాయమ్మ, నాయకులు భీములు, మోహన్‌రెడ్డి, ఏసీఎఫ్ ఫౌండేషన్ చైర్మన్ అశోక్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్ ఉన్నారు.

రాష్ట్రంలో ఉద్యోగులకే దిక్కు లేదు

- డిమాండ్ల సాధన కోసం రోడ్లు ఎక్కని శాఖ లేదు
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మండిపాటు
- పంచాయతీ జూనియర్ కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం



పరిగిలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో.. ప్రభుత్వ ఉద్యోగులను సైతం పట్టించుకునే పరిస్థితి లేకుండాపోయిందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ జూనియర్ కార్యదర్శులు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం కనిపించడం లేదని మండిపడ్డారు. పరిగిలో చేపట్టిన సమ్మెకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాత హక్కుల పరిరక్షణ కోసం సమ్మె చేయని ఉద్యోగులు లేరన్నారు. నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ జూనియర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయకపోవడం విడ్డూరమన్నారు. వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, ఉపాధి హామీ ఉద్యోగులు ఇలా అన్ని శాఖల వారు రోడ్లెక్కి నిరసన చేస్తున్న సంఘటనలు కేసీఆర్ పాలనకు నిదర్శనమన్నారు. ఉద్యోగులు, రైతుల పక్షాన పోరాడేందుకు కాంగ్రెస్ ఎల్లప్పుడు ముందుంటుందని తెలిపారు. వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, పూడూరు మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు చిన్ననర్సింహులు, ఆంజనేయులు, శ్రీనివాస్‌నాయక్, రాజాపుల్లారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

పరిగి: పూడూరు మండలం పిడుగుర్తి గ్రామానికి చెందిన 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం టీఆర్‌ఆర్ నివాసంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నియంతృత్వ ధోరణి నచ్చక ఎంతో మంది పార్టీని వీడుతున్నారని, రానున్న రోజుల్లో ఇది ఊహించని స్థాయికి వెళ్తుందని తెలిపారు. కాంగ్రెస్‌లో పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

క్లుప్తంగా

మార్కెట్‌కు విరివిగా మొక్కజొన్న దిగుబడులు

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 562 మొక్కజొన్న బస్తాలు వచ్చాయి. బీట్లలో మొక్కజొన్న క్వింటాలుకు రూ.1,770 నుంచి రూ.1,850 వరకు అమ్మకాలు జరిగినట్లు మార్కెట్ కమిటీ తెలిపింది. ఎక్కువగా క్వింటాలుకు రూ.1,800 చొప్పున కొనుగోళ్లు జరిగాయని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


వర్ష

అనంతగిరి: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వికారాబాద్ పట్టణం కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభచాటారు. జి. వర్ష 84.4 శాతం సాధించగా, అనునిత్య, చైతన్యలక్ష్మి, సాయి సాత్విక, జ్యోత్స్న, రజితలు ఉత్తమ పర్సంటేజీతో అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ అపర్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జేపీఎస్‌లకు సీనియర్ల మద్దతు


జేపీఎస్‌లకు మద్దతు తెలుపుతున్న సీనియర్ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వికారాబాద్ మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె శనివారానికి రెండో రోజుకు చేరుకుంది. సమ్మెకు సీనియర్ పంచాయతీ కార్యదర్శులు సంఘీభావం తెలిపారు. వారితో పాటు ఉపాధి హామీ ఏపీఓ శీను, ఇతర సిబ్బంది సైతం మద్దతు పలికారు. జేపీఎస్‌ల ధర్నా వల్ల వారి గ్రామాలను ఇన్‌చార్జిలుగా తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నందున తాము తీసుకోమని సీనియర్ సెక్రటరీలు అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు.

సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా పకీరప్ప


నియామక పత్రాన్ని అందుకుంటున్న పకీరప్పయాదవ్

కొడంగల్ రూరల్: గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హస్నాబాద సర్పంచ్ పకీరప్ప నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. యాదవులు, కురుమలు, గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారని పకీరప్ప తెలిపారు.

కొలువుల కోసం నిరంతర సాధన

- పుస్తకాలతో నిరుద్యోగులు కుస్తీ
- కలెక్టర్ చొరవతో జిల్లా గ్రంథాలయంలో మౌలిక వసతులు


జిల్లా గ్రంథాలయంలో చదువుతున్న అభ్యర్థులు

వికారాబాద్ అర్బన్: ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో నిరుద్యోగులు సిద్ధమవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా గ్రంథాలయంలో వందలాది మంది నిరుద్యోగులు చదువుతున్నారు. గతంలో రోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు తెరిచి ఉండే గ్రంథాలయం ఇప్పుడు రాత్రి 10 గంటల వరకు తెరిచే ఉంటోంది. ఇటీవల గ్రథాలయాన్ని సందర్శించిన కలెక్టర్ నిరుద్యోగుల విన్నపం మేరకు రెండు గంటల సమయం పెంచి మరింత చదువుకునే అవకాశం కల్పించారు. కలెక్టర్ చొరవతో గ్రంథాలయానికి వైఫై, ఇంటర్ నెట్ కనెక్షన్‌తో పాటు, స్టడీ చైర్స్, అదనంగా పాఠ్యపుస్తకాలు సమకూర్చారు.

పరీక్షలు నిర్వహిస్తారనే నమ్మకంతో..

గ్రూప్–1 పేపర్‌తో పాటు మరికొన్ని ప్రభుత్వ ఉద్యోగాల పేపర్ లీకేజీలు నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. అయినప్పటికీ నిరుద్యోగులు పట్టు వదలని విక్రమార్కుల్లా చదువుతూనే ఉన్నారు. ప్రభుత్వ నోటిఫికేషన్లు వరుసగా వెలువడగానే వేల మంది నిరుద్యోగులు ప్రైవేటు ఉద్యోగాలు వదిలేసి చదువుతున్నారు. ప్రభుత్వం ముందుగా ఇచ్చిన తేదీల ప్రకారం పరీక్షలు నిర్వహిస్తుందనే నమ్మకం ఉందని అంటున్నారు. అయితే అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మాత్రం అనేక లోపాలు ఉన్నట్లు నిరుద్యోగులు వాపోతున్నారు.

నిరుద్యోగులకు తీవ్ర నష్టం

ప్రభుత్వ నిర్ణయాలతో నిరుద్యోగులకు ఆయా ఉద్యోగాల నియామకాల్లో తీవ్రంగా నష్టం జరుగుతున్నట్లు చెబుతున్నారు. గురుకులాల్లో భర్తీ చేసే టీజీటీ , పీజీటీ పోస్టుల్లో 80శాతం మహిళా నిరుద్యోగులకు రిజర్వేషన్ కల్పించినట్లు చెబుతున్నారు. పైగా మిగతా 20శాతం కోటాలో కూడా తిరిగి మహిళలకు అవకాశం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు పరీక్షలు ఒకేరోజు

కానిస్టేబుల్, జూనియర్ లైన్ మేన్ ఉద్యోగాలకు రాత పరీక్షలు ఆదివారం రోజు ఉండటంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయంలో తేడా ఉన్నా సెంటర్లు సుదూర ప్రాంతాల్లో ఉంటే సమయానికి చేరుకోవడం సాధ్యం కాదనే అంటున్నారు. ఈ విషయంలో నిరుద్యోగులు గందరగోళానికి గురవుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయాలతో నష్టం



పేపర్ లీకేజీలతో నిరుద్యోగులకు తీవ్ర నష్టమే. పేపర్ లీకేజీ కేసు ఏ దశలో ఉందో ప్రభుత్వం చెప్పాలి. విషయాన్ని పూర్తిగా బయటకు రాకుండా చేస్తున్నారు. దీంతో మరింత అనుమానం పెరుగుతోంది. ప్రభుత్వం తీసుకునే కొన్ని నిర్ణయాలు నిరుద్యోగులకు శాపంగా మారాయి. గురుకులాల్లో భర్తీ చేసే జేఎల్ పోస్టులకు డెమో పద్ధతి తీసుకొచ్చారు. ఈ విధానంతో అవకతవకలు జరిగే అవకాశం ఉంది. పైగా జేఎల్ ఉద్యోగాల్లో 80శాతం మహిళలకే ఇవ్వడంతో పురుషులకు తీవ్ర నష్టం జరుగుతోంది. మహిళలకు దక్కాల్సిన 33శాతంతోపాటు పురుషుల కోటాలో కూడా 50శాతం ఇవ్వనున్నట్లు మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ లెక్క ప్రకారం 1200 జేఎల్ పోస్టుల్లో 800 ఉద్యోగాలు మహిళలకే వెళ్తాయి. దీంతో పురుషులకు తీవ్రంగా నష్టం జరుగుతుంది. ఎవరి కోటా వారికి ఇవ్వాలి.

– శ్రీనివాస్, జేఎల్, అభ్యర్థి

నోటిఫికేషన్లకే పరిమితం కావొద్దు



పేపర్ లీకేజీలు మానసికంగా ఇబ్బంది కలిగించినా పరీక్షలు నిర్వహిస్తారనే నమ్మకంతో చదువుతున్నాం. ఉద్యోగాల భర్తీ కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తున్నాం. ఈ దశలో ప్రభుత్వం నిరుద్యోగులను నిరాశకు గురిచేస్తే తీవ్రంగా నష్ట పోతాం. ప్రభుత్వం నోటిఫికేషన్లతోనే కాలం గడపొద్దు. వెంటవెంటనే ఉద్యోగాల నియామకం చేపడితే నిరుద్యోగులకు మేలు జరుగుతుంది. రెండు మూడు పరీక్షలు రాస్తున్నాను. ఏదో ఒకటి సాధించాలని కొన్ని నెలలుగా ప్రిపేర్ అవుతున్నాను.

– శ్రీకాంత్, గ్రూప్–4 అభ్యర్థి

తెగిన 11కేవీ విద్యుత్ వైరు


బుద్దారంలో ఇంటిపై పడిన విద్యుత్ వైరు


వైరు తెగిన విద్యుత్ స్తంభం

తప్పిన ప్రమాదం

పెద్దేముల్: ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైరు ఓ ఇంటిపై తెగిపడింది. శనివారం బుద్దారం గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. స్థానిక సబ్‌స్టేషన్ నుంచి కందనెల్లి ఫీడర్ లైన్ 11కేవీ విద్యుత్ వైరు బుద్దారం గ్రామం మీదుగా వెళ్తుంది. ఉదయం వేళ రెండు వైర్లు రాసుకొని మంటల వచ్చాయి. ఈ క్రమంలో ఓ వైరు గ్రామంలోని తొర్మామిడి స్వామిదాస్ ఇంటిపై తెగి పడింది. దీంతో అప్రమత్తమైన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందజేశారు. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరోవైర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గ్రామం మీదుగా విద్యుత్ లైన్లను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై గతంలోనూ ఫిర్యాదు చేసినట్లు మాజీ సర్పంచ్ వెంకటయ్య తెలిపారు. పెద్ద ప్రమాదం చోటుచేసుకోకముందే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.1.42 కోట్లతో నూతన మార్చురీ భవనం, ప్రహరీ, తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేటుకు దీటుగా వైద్య సేవలు కొనసాగుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించేలా వైద్యులు కృషి చేయాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని, ఐసోలేషన్ కేంద్రాన్ని సందర్శించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో డీఎంఓ ప్రదీప్, ఆస్పత్రి సూపరింటెండెంట్ సాదియా ఫర్హానా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, డాక్టర్లు శ్రీనివాస్, కౌన్సిలర్లు మునీర్, కృష్ణ, రవి, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు


మంబాపూర్‌లో విచారణ చేపడుతున్న డీపీఓ తరుణ్‌కుమార్

- డీపీఓ తరుణ్‌కుమార్
- మంబాపూర్‌లో నిధుల గోల్‌మాల్‌పై విచారణ

పెద్దేముల్: పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) తరుణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని మంబాపూర్‌లో నిధుల గోల్ మాల్‌పై శనివారం ఆయన గ్రామంలో విచారణ చేపట్టారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి ఖమ్రొుద్దిన్.. సంతకాలు ఫోర్జరీ చేసి రూ. పది లక్షల 20వేలు కాజేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డీపీఓ గ్రామానికి వచ్చి సర్పంచ్, ఎంపీటీసీ, పంచాయతి సభ్యుల సమక్షంలో విచారణ జరిపారు. అన్ని విషయాలపై క్షుణ్ణంగా విచారణ చేశారు. స్వచ్ఛ భారత్ కింద గ్రామంలో ఎన్ని మరుగు దొడ్లు నిర్మాణం చేశారు? ఇంక ఎంత మందికి బిల్లులు ఇవ్వాల్సి ఉందని ప్రశ్నించగా, ఇంకా 10 మందికి బిల్లులు రావసి ఉందని కార్యదర్శి తెలియచేశారు. అనంతరం మరుగు దొడ్లకు సంబంధించిన చెక్కు బుక్స్, పలు రికార్డులను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ఇది ప్రాథమిక విచారణ మాత్రమేనని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆతరువాత పూర్తి విచారణ చేపడతామన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఆడిట్ చేస్తామన్నారు. నిధులను దుర్వినియోగం చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. ఇదిలా ఉంటే.. మంబాపూర్‌లో జరుగుతున్న అవినీతిపై పలు మార్లు ఎంపీఓ షేక్ సుస్మాకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నిధులు పక్కదారి పట్టాయని ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు మోహీద్, కిరణ్‌లు డీపీఓకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణ్‌కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉప సర్పంచ్ పద్మమ్మ, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరం


రుద్రారం గ్రామంలో పూడికతీత తరువాత పంట కాలువ ఇలా..

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు కింద ఉన్న పొలాల కాల్వల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, ఏపుగా పెరిగిన గడ్డిని ఉపాధిహామీ పథకం కింద తొలగిస్తున్నారు. మండల పరిధిలోని అల్లాపూర్, నాగసమందర్, బూర్గుగడ్డ, రుద్రారం గ్రామాల కూలీలు రోజుకు 80 నుంచి 120 మంది వరకు పనులు చేస్తున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టును ఆధునీకరించేందుకు ప్రభుత్వం నుంచి తగిన నిధులు మంజూరు అయ్యేవరకు ప్రజల భాగస్వామ్యంతో ఉపాధిహామీ పథకం కింద పనులు చేయించాలని కెలెక్టర్ నారాయణరెడ్డి ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఏపీఓ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి కూలీల ద్వారా నిర్దేశిత పనులను మే నెల లోగా పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం కాల్వల పనులు చకా చకా కొనసాగుతున్నాయి.

పనులు పూర్తి చేస్తాం

కోట్‌పల్లి ప్రాజెక్టు పరిధిలోని పంట పొలాల్లో ఏర్పాటు చేసిన కాల్వల్లో పనులను వానకాలం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేస్తామని ఏపీఓ సురేశ్ బుధవారం తెలిపారు. పంట కాల్వల్లో పేరుకుపోయిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించి ప్రాజెక్టు నీరు నేరుగా పొలాలకు పారేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

బషీరాబాద్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను బషీరాబాద్ పోలీసులు శనివారం సీజ్ చేశారు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్మైపల్లి గ్రామానికి చెందిన నీల మహిపాల్ ట్రాక్టర్, గోనూర్‌కు చెందిన చామకూర రమేష్ ట్రాక్టర్ కాగ్నాలో ఇసుక తోడి కాశింపూర్ వైపు వస్తుండగా గమనించిన పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ జరిపారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్‌లను సీజ్‌చేసినట్లు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి


మృతి చెందిన రహీం

అనంతగిరి: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం వికారాబాద్ పట్టణంలో సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ శీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గఫార్, రహీం (32)లు వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి సమీపంలోని సిమెంట్ దుకాణంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాయంత్రం చాయ్ తాగడానికి ఎన్నెపల్లి చౌరస్తాకు బైక్‌పై వెళ్లారు. తిరిగి దుకాణం వైపు వస్తుండగా పరిగి వైపు నుంచి ఓ బైకిస్టు అతివేగంగా వచ్చి ఢీకొట్టారు. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న రహీం ఒక్కసారిగా ఎగిరి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గఫార్‌తోపాటు, మరో బైక్‌పై ఉన్న ప్రసాద్ మరొకరికి గాయాలయ్యాయి. వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. రహీంను హైదరాబాద్‌కు తరలించే క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందారు. రహీం స్వస్థలం బీహార్ రాష్ట్రం. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత కుట్టు శిక్షణ


కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్

వికారాబాద్ అర్బన్: ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని 31వ వార్డు కౌన్సిలర్ గాయత్రి లక్ష్మణ్ గుప్త తెలిపారు. 31వ వార్డు శివరాంనగర్‌లో నిర్మాణ్ సంస్థ వారి సహకారంతో కౌన్సిలర్ సొంత నిధులతో కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ 40ఏళ్ల లోపు మహిళలు ఉచిత కుట్టు శిక్షణ పొందవచ్చని తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మాణ్ సంస్థ సిబ్బంది, వార్డు మహిళలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కొందుర్గు: విద్యుదాఘాతంలో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మహదేవ్‌పూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహదేవ్‌పూర్ గ్రామానికి చెందిన రైతు ఎరుకలి పుల్లయ్య(65) శుక్రవారం రాత్రి పొలానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. పొలంలవద్ద స్టార్టర్‌లో విద్యుత్ వైర్లను సరి చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైన అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పొలంలో విగతజీవిగా పడి ఉన్నాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తాండూరు రూరల్: రాంపూర్ గేటు సమీపంలో ఉన్న అల్‌మాస్ ఇంటర్నేషన్ స్కూల సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది.ఈ సంఘటన శనివారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అల్‌మాస్ ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహన్ని గుర్తించారు. వెంటనే కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు.


నడి రోడ్డులో గుంత ఏర్పడటంతో అడ్డుపెట్టిన కూలర్ డబ్బా

జర దేక్‌ఖే చలో భాయ్..

వికారాబాద్ అర్బన్: బీటీ రోడ్డు వేసి నెల రోజులు గడవక ముందే నడి రోడ్డులో గుంత ఏర్పడింది. రోడ్డు బాగుందని వేగంగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వికారాబాద్ నుంచి కొత్తగడి వెళ్లే రోడ్డును ఇటీవలే ఆర్‌అండ్‌బీ అధికారులు బీటీ వేయించారు. చాలా కాలం తరువాత బీటీ రోడ్డు వేయడంతో వాహనదారులు సంతోషించారు. నాణ్యత లోపం కారణంగా నడిరోడ్డులో గుంత పడి కంకర తేలింది. ఫలితంగా పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. చేసేదిలేక బాట సారులు ప్రమాదాలను తప్పించేందుకు అక్కడ పాత కూలర్ డబ్బాను ఏర్పాటు చేశారు. పాత బట్టను కూడా కట్టి అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకున్నారు. నెల రోజుల క్రితం వేసిన బీటీ రోడ్డు అధ్వానంగా మారడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడి అరెస్ట్


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ వెంకన్న

బొమ్మలరామారం: బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మైనర్‌ను క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం తురుమామిడి గ్రామానికి చెందిన రావులపల్లి నర్సింహులు కొంతకాలంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం హర్దాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఓ తోటలో పనిచేస్తున్నాడు. కాగా, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కూడా హర్దాస్‌పల్లి గ్రామానికి వ్యవసాయ కూలి పనులకు వెళ్తుండేది. ఈ క్రమంలో నర్సింహులు ఆ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. దీంతో, నర్సింహులు సదరు బాలికకు మాయమాటలు చెప్పి ఈ నెల 23న కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యులు నర్సింహులుపై అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. నర్సింహులును అతడి స్వగ్రామంలోనే అరెస్ట్ చేసి బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ వెంకన్న వివరించారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

అడ్డుకున్న ప్రజాప్రతినిధులు


బాగాయిపల్లి సమీపంలో ఇసుక టిప్పర్లు

యాలాల: అనుమతుల పేరిట సాయంత్రమైనా ఇసుక తరలింపు జరుగుతుండటంతో మండల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్లలో ఇసుక తరలిస్తుండటంతో వాహనాలను అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మండల పరిధిలోని బాగాయిపల్లి సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. కొడంగల్‌లో జరుగుతున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలతో పాటు ఇతర అభివృద్ధి పనులకు 1500 క్యూబిక్ మీటర్ల ఇసుక తరలింపునకు బొంరాస్‌పేట తహసీల్దార్ ఆరు టిప్పర్లకు అనుమతి ఇచ్చారు. అయితే ఇసుకను బొంరాస్‌పేట పరిధిలోని దువ్వచర్ల సమీపంలోని కాకరవేణి నది నుంచి ఇచ్చినప్పటికీ, తరలింపు ప్రక్రియ మొత్తం యాలాల మండల పరిధిలోని దేవనూరు, పగిడియాల, ముద్దాయిపేట పరిధిలోంచి గత నాలుగు రోజులుగా జరుగుతుంది. అయితే అనుమతి పత్రాల్లో ఒక్కో టిప్పరుకు రోజుకొక ట్రిప్పు చొప్పున మొత్తం 9 టిప్పులు మాత్రమే తరలించాలని అనుమతి ఉంది. ఇందుకు విరుద్ధంగా రోజూ పదుల సంఖ్యలో ఇసుక తరలింపు సాగుతుంది. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే అనుమతి ఉన్నప్పటికీ సాయంత్రం ఆరు దాటినా ఇసుక టిప్పర్లు యథేచ్ఛగా రవాణా సాగిస్తున్నాయి. ఈ విషయాన్ని గమనించిన పగిడియాల ఎంపీటీసీ రాములు, సొసైటీ డైరెక్టర్లు అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు టిప్పర్లను అడ్డుకున్నారు. ఇసుక టిప్పర్ల విషయమై తహసీల్దార్ గోవిందమ్మ, ఎస్‌ఐ అరవింద్‌కుమాలకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధుల ఫిర్యాదుతో నాలుగు టిప్పర్లను శనివారం సాయంత్రం యాలాల పీఎస్‌కు తరలించారు. పత్రాలు సరిగ్గా ఉండటంతో వాహనాలను వదలిపెట్టారు.